**కామెడీ కథ**

## "వచ్చాడా?"

**వదిన వనజ గొంతు ప్రశ్నిస్తుంటే కలల అలజడిలోంచి ఇలలోకి మెలకువొచ్చింది వనజ మరిది లక్ష్మణ్రావుకి.**

**"అచ్చిందమ్మా" పనిమనిషి యాదమ్మ వనజ ప్రశ్నకి జవాబి స్తోంది.**

"పద మరీ గబగబా" వనజ యాదమ్మని తొందరపెడ్తోంది. లక్ష్మణ్రావు కూడా గబగబా హడావిడిగా లేచాడు. ముందు రోజే వార్నింగిచ్చింది వనజ "ఎనిమిదిన్నర కల్లా నీళ్లయిపోతా యబ్బాయ్! ఈలోగానే స్నానం గీనం ఫినిష్ చేసుకోవాలి" అని.

లక్ష్మణ్రావు ఇంటరయ్యాక నెలరోజుల సెలవులు హైద్రా బాద్‌లో అన్న రామారావింట్లో గడపడానికొచ్చాడు. సిటీ లైఫ్ అతనికి బలే నచ్చింది కాస్త నీళ్లకి ఇబ్బందయితే అయింది కానీ. అన్ని సౌకర్యాలతో కాంపాక్ట్‌గా చిన్న చిన్న ఫ్లాట్లు, లిఫ్టులూ, జనరేటర్లూ, వాచ్‌మెన్లూ, షోగ్గా మనుషులు, మాంచి రోడ్లూ, ఫ్లైఓవర్లూ... ఏదో విదేశానికొచ్చి పడ్డట్టుంది లక్ష్మణ్రావు ప్రాణానికి.

వరసగా వారం రోజులు "వచ్చాడా?" "అచ్చిందమ్మా" "పదపద గబగబా, జల్దీజల్దీ" అన్న వనజ, యాదమ్మల డైలా గులతోనే మేలుకున్నాడతను. 'పొద్దున్నే ఎవరికోసం వీళ్ల ఆతృత?' అనుకున్నాడు. ఆ ప్రశ్న అతని మనసులోనే ఉండి పోయింది. అతను పాపం స్వతహాగా మొహమాటస్తుడు. వదిన దగ్గరాట్టే చనువులేదు. అసలే ఆవిడ ఎప్పుడూ ఎవరో తరుముకొస్తున్నట్టు, ఏదో తొందర్లో ఉన్నట్టూ, భూభారం అంతా తనే మోస్తున్నట్టు పరమ సీరియస్‌గా ఉంటూం టుంది. ఎలా డిస్టర్బ్ చేయడం?

పోనీ అన్న రామారావుని అడుగుదామంటే అతగాడు అమెరికాతో లింకున్న ఇండియన్ కంపెనీలో పని చేస్తు న్నాడు. ఇండియాలో రాత్రయినా యు.ఎస్.లో పగలే కాబట్టి ఆ దేశపు పనివేళల్లోనే వీళ్లూ పనిచేయాలి. మరంచేత రాత్రంతా ఆఫీసులో గాడిద చాకిరీ చేసి పగలంతా ఇంట్లో గొడ్డులా నిద్రపోతాడతను. అలా గాడిదావతారం, గొడ్డావ తారం మధ్య ఆల్టర్నేటవుతూ ఉండే అన్నగారితో మాటలే ముంటాయ్?

ఆరోజు కూడా "వచ్చాడా?" అంటున్న వదిన గొంతు విని చటుక్కున లేచి కూచున్నాడు. 'ఆ వచ్చే వాడ్నెవడ్నో కళ్లారా చూడాలి' అన్న ఆతృతతో ఛెంగున మంచం మీంచి దూకాడు.

"రాలే" యాదమ్మ నిరాశతో జవాబు!

"పదపద. గబగబా జల్దీజల్దీ" వనజ మాటలు విని బిగును కుపోయాడు లక్ష్మణ్రావు!

ఏనుగు చచ్చినా పది వేలే బతికినా పది వేలే అన్న పాత కాలం సామెత గుర్తొచ్చింది. 'అతగాడెవరోగానీ వచ్చినా హడా విడే రాకపోయినా హడావిడే! ఇవాల్టితో ఈ మిస్టరీ తేల్చె య్యాలి!' హాల్లోకి వెళ్లాడు. అప్పటికే వనజ వెనుక వైపు బాల్క నీలోకి చేరి చకచకా ఆర్డర్లిస్తూ యుద్ధప్రాతిపదిక మీద ఏవో సద్దింపులు సద్దిస్తోంది.

'ఇంకిప్పుడు ఈవిడ్ని డిస్టర్బ్ చేయడం భావ్యం కాదు' డిసైడ్ చేసుకుని బ్రష్షు పుచ్చుకుని బాత్‌రూమ్ వైపు నడి చాడు.

ఫాలో హిమ్' లక్ష్మణ్రావులో డిటెక్టివ్ మేల్కొని బయల్దేరతీ శాడు. నెమ్మదిగా తను కూడా తలుపు దగ్గరగా లాగి బయ టకెళ్లాడు. లిఫ్టెక్కకుండా నిశ్శబ్దంగా మెట్లు దిగెళ్లి చూశాడు.

కింద రామారావు, వాచ్‌మెన్ ఓ స్తంభం దగ్గర నిలబడి ఏవో డిస్కస్ చేస్తున్నారు. "ఒక ఫేజేదో పోయినట్టుంది సారూ. నడుస్తలేదు" వాచ్‌మెన్ గొంతు. "కరెంటొస్తానే మల్లొచ్చి మిమ్మల్ని పిలుస్త"

"మళ్లీ పిలవక్కర్లేదులే, నువ్వే కానిచ్చెయ్" రామారావు జేబులోంచి ఓ నోటు తీసి మల్లేషు జేబులో పెట్టాడు.

లక్ష్మణ్రావు అనుమానం బలపడింది. నిశ్శబ్దంగా మెట్లన్నీ చచ్చీ చెడీ ఎక్కి అన్నకన్నా ముందొచ్చి మంచం మీద చేరాడు. కొంతసేపయ్యాక రామారావింట్లోకొచ్చి తలుపేసుకో వడం వినపడింది.

# ఇది పట్నం మరదో!

ఆ రోజు పొద్దున్న, సాయంత్రం ఆ బిల్డింగులోని మను షుల్లో ఒక మార్పు గమనించాడు లక్ష్మణ్రావు. ఆడా మగా అందరూ యథాప్రకారం టిప్పుటాపు డ్రెస్సులూ, మేక ప్పులూ అన్ని హంగులతోనూ ఉన్నారు గానీ, మొహాలు మాత్రం ఎందుకో కళ తప్పాయి. బయటికి పనుల మీద వెళ్తో స్తున్న వాళ్లందరూ "వచ్చాడా?" అని వాచ్‌మెన్‌ని అడుగుతు న్నారు. "లేదు" అన్న సమాధానం విని విషణ్ణవదనాలతో లిఫ్టెక్కిపోతున్నారు.

అలా ఇంకో రెండ్రోజులు గడిచాయి. మనుషుల్లోనూ, ఆ ప్రశ్న జవాబుల్లోనూ మార్పు లేదు. మొత్తం బిల్డింగులో ఓ మార్పు లక్ష్మణ్రావు ముక్కు గమనించింది.

నన్నగా ఏదో దుర్వాసన!

ఎటెళ్లినా అదే వాసన!

ఓసారి కుళ్లిన కేబేజీలా, మరోసారి మురిగిన మాంసంలా, ఓసారి ఘాటుగా, ఓసారి లైటుగా గాలివాటాన్ని బట్టీ.

'ఈ వాసనేంటో! వాడెవడో రావడమేంటో! ఎవర్నీ అడ క్కుండా నేనే కనిపెట్టెయ్యాలి' గాఠిగా డిసైడ్ చేసేసుకు న్నాడు.

యథాప్రకారం ఆదివారం వచ్చింది. సెలవు రోజున కూడా రామారావు మాత్రం గాడిద మరియు గొడ్డు అవతరాలు కంటిన్యూ చేశాడు. పగలంతా నిద్రపోయి రాత్రి టీవీ, కంప్యూటర్లకి ఫిఫ్టీ ఫిఫ్టీ అంకితమయ్యాడు. మరంచేత తమ్ముడు లక్ష్మణుల వారితో నోమాటల్స్.

ఆదివారం అర్ధరాత్రి డోర్ బెల్ "టింగ్ టింగ్" మని మోగింది. రామారావు తలుపు తీసి ఎవరితోనో మాట్లాడ్డం లక్ష్మణ్రావుకి వినబడింది. తలుపు దగ్గరగా లాగిన చప్పుడు, లిఫ్టు చప్పుడు బట్టి అతను ఎక్కడికో ఎవరితోనో వెళ్లాడని అర్థ మయి, లక్ష్మణ్రావు గుండె దడదడలాడింది.

'ఇంత రాత్రివేళ వదినకి చెప్పకుండా ఎక్కడికెళ్తున్నాడు?

**పోడూరి కృష్ణకుమారి**

'సందేహం లేదు. ఈ ఫ్లాట్లలో జరగరానిదేదో జరుగుతోంది. ముఖ్యంగా అన్నయ్య చెయ్యరాని వెధవ పనేదో చేస్తున్నాడు. కానీ వెధవ పనికీ, ఓ ఫేజు కరెంటుకీ ఏవిటి సంబంధం? బిల్డింగంతా ఈ కంపువాసన్లేమిటి? ఇక్కడ ఫ్లాట్ల వారీగా వంతులేసుకుని హత్యల్చేసి శవాల్నింట్లోనే దాస్తుంటారా? పాతకాలంలో రష్యను ప్రజలు కె.జి.బి. చేతుల్లో చిక్కుకు న్నట్టు వీళ్లంతా ఏ కేడీ గూండాల చేతుల్లోనో ఇరుక్కుని వాళ్లు చెయ్యమన్న నీచ నికృష్టప్పనులేవో చేస్తుంటారా డెయిలీ బేసిస్ మీద? ఏమిటీ మిస్టరీ భగవాన్!' రకరకాల ఆలోచనల్లో పడి లక్ష్మణ్రావు చాలాసేపు నిద్ర పోలేకపోయాడు.

సోమవారం పొద్దున్న ఇంట్లో ఎవరూ లేవక ముందే లేచాడు మిస్టరీ ఛేదించాలన్న ఆతృతతో. యాదమ్మ ఇంట్లోకొ స్తూనే "అచ్చిందమ్మా ఇన్నాల్టికియ్యాల" చింకి చేటంత మొహం చేసుకుని వనజతో చెప్పింది.

రివాజు తప్పకుండా "పద పద..గబగబా" డైలాగు వేసింది వనజ.

లక్ష్మణ్రావు మాటాడకుండా తీవ్రమైన చూపుల్తో యాద మ్మని గమనించాడు. వెనుకవైపు బాల్కనీలోంచి ఒక ప్లాస్టిక్ బస్తా లాంటి మూటని సగం మోస్తూ, సగం ఈడుస్తూ బైటి కారిడార్‌లోకి తీసుకెళ్లింది. బస్తాలోంచి భరించలేని దుర్గంధం. 'హు...హత్య! ఖచ్చితంగా ఈ మూటలో శవమే! ఇది చచ్చిన వాడి మొండెం!' నిర్ధారించుకున్నాడు. యాదమ్మ వెనకే వెళ్లి గుమ్మం దగ్గర నుంచుని చూశాడు. మిగతా ఫ్లాట్ల వాళ్లు కూడా ఇలాంటి మొండెం బస్తాలు తెచ్చి మధ్యలో నిలబడ్డ ఓ దుర్గంధ రాయణుడికి ఇస్తున్నారు. యాదమ్మ మళ్లీ లోపలకెళ్లి చిన్నసైజు బస్తామూట తెచ్చి చ్చింది. 'ఇదా మొండెం తాలూకు తలన్నమాట! వీడా వీళ్లం దర్నీ గ్రిప్పులో పెట్టుకుని మర్డర్లూ గట్రా చేయిస్తున్నది!' లక్ష్మ ణ్రావు గుండె బరువెక్కింది. ఇలా ఓ గూండా చేతిలో చిక్కి వాడు చెప్పినట్టల్లా పాడుపనులు చేస్తున్న తన అన్న వదినల

పట్లే కాక ఆ బిల్డింగులోని మొత్తం ప్రజానీకం పట్ల సానుభూతితో విలవిలలాడిపోయాడు.



ఆ రోజేదో పబ్లిక్ హాలీడే, అందరూ ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం భోజనాలప్పుడు రామారావుతో సహా అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర సమావేశమయ్యారు.

"ఏమిటి మరిది లక్ష్మణా! అలో లక్ష్మణా ఫేస్ పెట్టావేం?" అనడిగింది వనజ మరిది మొహంలోకి చూస్తూ.

లక్ష్మణ్రావు తీక్షణంగా చూశాడు. సూటిగా అడిగాడు "పొద్దున్న యాదమ్మ వాడెవడికో తీసుకెళ్లిచ్చిన ఆ నల్లటి కంపు బస్తాలేమిటి? అసలు వాడెవడు? వాడికీ మీకూ సంబంధం ఏమిటి?..ఆ...అంటే ఐ మీన్...వాడికీ ఈ బిల్డింగులో వాళ్లకీ అందరికీ ఏమిటి సంబంధం? ఏమిటి? ఏమిటి?" ఆవేశం ఆపుకోలేకపోయాడు.

"అదా బాబూ? అదో విషాదగాథ!" గంభీరంగా డైలాగేసి విషాదంగా మొహం పెట్టి కొంటెగా చూసింది వనజ. ఒళ్లు మండిపోయింది లక్ష్మణ్రావుకి.

"అబ్బ చెప్పూ, వాడ్ని చంపక" అన్నాడు రామారావు తమ్ముడి ప్లేట్లోంచి కొబ్బరిపచ్చడి తస్కరించి తింటూ.

"ఏమిటో మా తమ్ముడు మహా మేధావి అని గప్పాలు కొడ్తారుగా? ఈ మాత్రం తెలుసుకోలేకపోయాడు ఏం తెలివి? ఏవిటోయ్ మరిదీ మరీనూ. అర్థం కాలేదా? ఆ 'కంపు బస్తాలు', చెత్త సంచీలు. ఆ వచ్చిన వాడు చెత్త కలెక్టరు. మన రాజధానిలో ఇంట్లో చెత్త రోడ్ల పక్కన పోయడం నిషేధం.
రోజూ ఇళ్లల్లో చెత్త కలెక్ట్ చేసుకునే మనిషా కడొస్తాడు. మనం చెత్తని జాగ్రత్తగా ప్యాక్ చేసి అతనికందిస్తే అతను దాన్ని పట్టుకెళ్లి సర్కారువారను మతించిన చోట పారేస్తాడు.
నాలుగైదు రోజుల బట్టీ అతను రాక బిల్డింగంతా కంపెత్తిపోయి చచ్చాం."

"అదా సంగతీ? అంతేనా? ఇన్నాళ్ల కంపు వాసన్ల వెనుక రహస్యం ఇంతేనా?" డిసప్పాయింటయ్యాడు లక్ష్మణ్రావు. మళ్లీ పుంజుకుని, "అన్నయ్యా! ఆదివారం అర్ధరాత్రి లేచెళ్లి వాచ్‌మెన్‌తో మంతనాలు సాగించి వచ్చావు. ఎందుకోసం? ఎవరికోసం?" యథాప్రకారం తీక్షణమైన దృక్కులతో సూటిగా ఆవేశం జోడించి మరీ అడిగాడు లక్ష్మణ్రావు.

రామారావు ముఖంలోకి వనజ సీరియస్‌గా చూసింది. రామారావూ డిటో. 'దొరికాడు దొంగ. బండారం బయటపడుతుంది. బ్రహ్మాండం బద్దలవుతుంది. సంసారం కూలుతుంది. కూలనీ నాకేం భయం లేదు' నిర్లక్ష్యంగా చూశాడు లక్ష్మణ్రావు.

సుదీర్ఘమైన పది సెకండ్ల కాలం గడిచాక ఫక్కున నవ్వారు వనజ, రామారావు యుగళంగా. "ఏం లేదురా. మన కాలనీకింకా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ రాలేదు. సెప్టిక్ టాంకులు ఓవర్ ఫ్లో అవ్వకుండా ఉంచడం కోసం డ్రైనేజ్ నీళ్లు కొన్ని వెనుక వైపు ఖాళీగా ఉన్న స్థలాల్లోకి పంప్ చేసేస్తున్నాం. ఆ పనేదో గప్‌చుప్‌గా అర్ధరాత్రి చేసేస్తే పొద్దున్నకి ఆరిపోతుంది. ఆ పని కోసం ఫ్లాట్లలో వాళ్లం వంతుల వారీగా డ్యూటీ తీసుకుని లేచి వాచ్‌మెన్ డ్రైనేజ్ పంపింగ్ మోటార్ నడిపినంత సేపూ అక్కడుండి మోటార్ స్విచ్ లాక్ చేయించి వస్తాం. మొన్న ఆదివారం నా వంతు. ఆ రాత్రి ఓ ఫేజ్ కరెంటు పోయి మోటార్ నడవలా. కరెంటు వచ్చాక మళ్లీ నన్ను నిద్ర లేపకుండా ఉండేందుకు వాచ్‌మెన్‌కో పది లంచం ఇచ్చా. నువ్వు కష్టపడి మెట్లు దిగొచ్చి చూసిన దృశ్యం అదీ. కళ్లతో ఒకటి చూసి బుర్రతో వంద ఊహించుకోకు పేరనాయిడ్ వెధవా!" ముద్దుగా లక్ష్మణ్రావు డిప్ప మీద ఓ జెల్లకాయిచ్చాడు రామారావు.

లక్ష్మణుల వారి ముఖారవిందం...ఎందుకులెండి?

*